

ఆశలు తారుమారు

- గ్రామ పంచాయతీ రిజర్వేషన్‌లపై ఉత్కంఠ
- పలు మండలాల్లో ఖరారైన రిజర్వేషన్లు
- నేడు జిల్లా పంచాయతీ కార్యాలయానికి రిజర్వేషన్ల జాబితా
- సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు

గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికల సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. మండలాల వారిగా సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల జాబితాను ఎంపీడీవోలు, ఆర్‌డీవోలు జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపుతున్నట్లు తెలుస్తోంది. పలు మండలాల రిజర్వేషన్ జాబితాను అధికారులు ఇప్పటికే పంపినా పూర్తిస్థాయి జాబితా సోమవారం మధ్యాహ్నం వరకు చేరే అవకాశం ఉంది. అన్ని మండలాలకు సంబందించిన రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా అధికారులు జిల్లాలోని గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల రిజర్వేషన్‌లను అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

నిజామాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఏ విధమైన రిజర్వేషన్లు ఖరారు చేయాలో విధివిధానాలను వివరిస్తూ శనివారం జీవో 46ను విడుదల చేసింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ సర్పంచ్‌లకు రిజర్వేషన్‌లు ప్రకటించనున్నారు. వార్డు సభ్యులకు మాత్రం 2024 కులగణన ప్రకారం రిజర్వేషన్లను ప్రకటించనున్నారు. 50శాతం దాటకుండా పంచాయతీ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. మహిళలకు మాత్రం అన్నివర్గాల్లో 50 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయనున్నారు. బీసీలకు మాత్రం 2024 కులగణనల ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. జిల్లాలో 545 గ్రామ పంచాయతీలు, 5,022 వార్డులున్నాయి. గత అక్టోబరు నెలలో ఇదివరకే స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా అప్పుడు ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్‌లు ప్రకటిస్తూ ఇచ్చిన జీవో ప్రకారం గ్రామ పంచాయతీ, వార్డుసభ్యుల రిజర్వేషన్‌లను ఖరారుచేశారు. ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం జీవో నం.46 విడుదల చేయగా అప్పుడు ప్రకటించిన రిజర్వేషన్‌లతో పాటు 2018లో జరిగిన ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్‌లు పూర్తిగా తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్నో రోజులుగా గ్రామపంచాయతీ, వార్డుసభ్యుల ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు రిజర్వేషన్‌లు మారుతుండడంతో అయోమయంలో ఉన్నారు. ఒక్కసారిగా ఆశావహుల ఆశలన్నీ ఆవిరైపోతున్నాయి. గతంలో తమకు అనుకూలంగా వచ్చిన రిజర్వేషన్‌లు చూసి సంబర పడ్డ ఆశావహులు ఇప్పుడు రిజర్వేషన్‌లు మారుతుండడంతో నిరాశ చెందుతున్నారు.

పెరగనున్న బీసీ రిజర్వ్ స్థానాలు

జిల్లాలో 2018లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 530 గ్రామ పంచాయతీలు ఉండేవి. అందులో 229 గ్రామ పంచాయతీలు జనరల్ స్థానానికి రిజర్వ్ కాగా, 98 గ్రామపంచాయతీలు బీసీ రిజర్వ్ అయ్యాయి. 101 గ్రామ పంచాయతీలు ఎస్సీకి రిజర్వ్ కాగా, 102 గ్రామ పంచయతీలు ఎస్టీకి రిజర్వ్ అయ్యాయి. ఇప్పుడు గ్రామ పంచాయతీల (మిగతా 8లో..)

నేడు రిజర్వేషన్లు కొలిక్కి వచ్చే అవకాశం

జిల్లాలోని అన్నిమండలాలకు సంబంధించి గ్రామాల వారిగా సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియ తుది దశకు వచ్చినట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీ రిజర్వేషన్‌లను ఆర్‌డీవోలు, వార్డుసభ్యుల రిజర్వేషన్‌లను ఎంపీడీవోలు ఖరారుచేసి కలెక్టర్‌కు పంపుతున్నారు. ఇప్పటికే పలు మండలాలకు సంబందించిన రిజర్వేషన్‌ల జాబితా జిల్లా యంత్రాంగానికి చేరుకున్నాయి. మరికొన్ని మండలాల రిజర్వేషన్ల జాబితాలు సోమవారం మధ్యాహ్నం చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని మండలాలకు రిజర్వేషన్ల జాబితాలో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో కొన్ని మండలాల్లో ఇంకా రిజర్వేషన్‌లు ప్రకటించని ఆశావహులంతా తమ గ్రామాల రిజర్వేషన్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ప్రకటించిన రిజర్వేషన్లు మళ్లీ తారుమారు అవుతుండడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఇదివరకే పోటీచేయాలని సిద్ధంగా ఉన్న అభ్యర్థులు తమకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తే బరిలో నిలవాలని, లేక మహిళలకు కలిసి వస్తే వారిని పోటీలో దింపేందుకు సన్నద్ధమవుతున్నారు. 25న ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉండగా, డిసెంబరు 2వ వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి బదిలీ

నిజామాబాద్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న నాగేంద్రచారిని బదిలీ చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో యేడాదిన్నరకు పైగా పని చేస్తున్న ఆయనను సిరిసిల్లా ఎస్‌డీపీవోగా బదిలీచేశారు. సీసీఎస్ ఏసీపీతో పాటు టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే టాస్క్ ఫోర్స్ ఏసీపీ పోస్ట్ ఖాళీగా ఉండగా ఇప్పుడు సీసీఎస్ ఏసీపీ పోస్టు సైతం ఖాళీ అయింది. జిల్లాలో సీసీఎస్ విభాగంపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సీపీ సాయిచైతన్య పలువురు కానిస్టేబుళ్లు, ఎస్‌ఐలను బదిలీ చేశారు. సీసీఎస్‌ను ప్రక్షాళన చేసే ప్రయత్నాల్లో సీపీ ఉండగా సీసీఎస్ ఏసీపీ బదిలీ సాధారణ బదిలీల్లో భాగమా లేకా ప్రక్షాళనలో భాగమా అనేది తేలాల్సి ఉంది. ఇంకా సీసీఎస్ ఏసీపీగా జిల్లాకు ఇప్పటివరకు ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.



పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

విద్యాహబ్‌గా బాన్సువాడ: పోచారం

కోటగిరి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలంలోని పీఎస్‌ఆర్ నగర్‌లో ఆదివారం యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.200 కోట్లతో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ (మిగతా 8లో..)

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

- పట్టింపులకు పోతే ప్రజలు నష్టపోతారు
- త్వరలో జిల్లాకు ఎయిర్‌పోర్టు
- నందిపేట బస్ డిపో ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తా
- రహత్‌నగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా: పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్
- గ్రామ అభివృద్ధికి 11 ఎకరాల భూమి విరాళం
- రూ.50 లక్షలతో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పీసీసీకి గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

భీమ్‌గల్‌రూరల్/నందిపేట, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరగాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. పంతాలకు పోతే తమను నమ్ముకున్న ప్రజలు నష్టపోతారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి ఆదివారం నిజామాబాద్ జిల్లా నందిపేటలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ నాయకులు పంతాలు పట్టింపులకు వెళ్తే ప్రజలు నష్టపోతారన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో (మిగతా 8లో..)



ధర్మపురి సంజయ్‌ని సన్మానిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

మున్నూరుకాపులంతా ఏకం కావాలి

- కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యం
- డీసీసీ, సీసీసీలో 75 శాతం బీసీలకే అవకాశం
- సంజయ్‌కి భవిష్యత్తులో మరిన్ని పదవులు
- పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్

నిజామాబాద్‌సిటీ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా మాజీ మేయర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ధర్మపురి సంజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బీసీలంతా ఏకం కావాలని, రాజకీయంగా ఉన్నత స్థానాలను అధిరోహించాలని, జిల్లాలోని బీసీలు దేశంలోని ఇతర బీసీ కులాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని, బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట (మిగతా 8లో..)



చీర కావాలంటే.. ఫొటో దిగాల్సిందే

- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి రాష్ట్ర సర్కారు నిబంధన
- విలేజ్ బుక్ కీపర్ల ఆధ్వర్యంలో నిర్వహణ

6

7

బోర్డులకే పరిమితమా?

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- కానరాని క్రీడా సామగ్రి, వసతులు
- గ్రామీణ యువత ఇబ్బందులు

అడిషనల్ కలెక్టర్‌కు కమిషనర్ బాధ్యతలు

- రెండు వారాలు సెలవుల్లో బల్దియా కమిషనర్ దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ స్థానంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కుమార్ చార్జ్ తీసుకోనున్నారు. బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న దిలీప్‌కుమార్ వ్యక్తిగత సెలవుల్లో 2 వారాలు వెళ్లారు. ఆయనస్థానంలో తాత్కాలికంగా అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు చార్జ్ ఇచ్చారు. తాజాగా మున్సిపల్ కమిషనర్ స్థానంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కు ఎఫ్‌ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జెస్) ఇచ్చారు. ఈమేరకు సీఎండీఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా అంకిత్ కుమార్ సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్‌కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్ రెవెన్యూవిభాగం చూస్తుండగా, డిప్యూటీ కమిషనర్ రవిబాబు శానిటేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బల్దియాకు స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న సుదర్శన్‌రెడ్డి

అమ్మవారి ఆశీస్సులతో..

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సుదర్శన్‌రెడ్డి

బోధన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద పెద్దపోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చిన కర్నె భూమన్నకు, విగ్రహదాతలైన ప్రదీప్ గుప్తా, ప్రతాప్ గుప్తాలకు, (మిగతా 8లో..)

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్

నిజామాబాద్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూమేశ్వర్ డిమాండ్‌చేశారు. ఆదివారం (మిగతా 8లో..)





పోలీసుశాఖ ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి

ఘనంగా సత్యసాయి జయంతి

- శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా అధికారులు
- పలుచోట్ల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

7

హమాలీ వర్కర్స్ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సామ్రాజ్యం



బల్దియాపై ఏసీబీ నిఘా

- 18న టౌన్‌ప్లానింగ్ విభాగంలో సోదాలు
- సెల్‌ఫోన్లు, రికార్డులు స్వాధీనం
- ఆఫీసుకు టీపీఎస్‌లు డుమ్మా
- భయం భయంగానే ఉద్యోగులు, సిబ్బంది

నిజామాబాద్‌సిటీ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంపై ఏసీబీ నిఘా ఇంకా కొనసాగుతోంది. బల్దియా కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఈనెల 18న బుధవారం ఉదయం టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్థరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్‌లు, టీపీబీవోలు, సిబ్బందిని ఉదయం నుంచి రాత్రివరకు విచారించారు. అనంతరం వారి మొబైల్స్, రికార్డులు తీసుకెళ్లారు.

మొబైల్స్ ఇంకా ఏసీబీ వద్దే..

ఈనెల 18న తనిఖీల్లో భాగంగా అధికారులు మొబైల్స్ తీసుకెళ్లారు. రికార్డులు, అనుమతులు, ఓటీపీలు వంటి సమస్త సమాచారం మొత్తం మొబైల్స్‌లోనే ఉంటుంది. ఫిర్యాదులు వచ్చిన రికార్డులు, అనుమతులకు సంబంధించిన వివరాలు నిరూఢీ కోసం మొబైల్ ఫోన్లు తీసుకెళ్లారు. నాలుగైదు రోజులు గడుస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారుల మొబైల్స్ తిరిగి ఇవ్వలేదు. దాంతో శనివారం అధికారులు కార్యకలాపాలు జరపలేదు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీబీల సోదాల సమయంలో కొందరు అధికారులు, సిబ్బంది మాత్రమే కార్యాలయంలో ఉన్నారు. సోదాలు జరుపుతున్న సమయంలో అధికారులు, సిబ్బంది మొబైల్స్ స్విచ్ ఆఫ్‌చేసి వారివద్దే ఉంచుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లను, సిబ్బందిని రాత్రి 11 తర్వాత పంపించేశారు. అర్థరాత్రి వరకు తనిఖీచేసి రికార్డులు, మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

సెలవుల్లో టీపీఎస్‌లు..

టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీబీల సోదాల సమయంలో కొందరు అధికారులు కార్యాలయంలో ఉండగా, మరికొందరు క్షేత్రస్థాయిలో ఉండగా, కొందరు మాత్రం ఇంకా ఆఫీసుకు రాలేదు. ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయన్న సమాచారం తెలుసుకున్న మిగతా అధికారులు తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వారి మొబైల్స్ స్విచ్ ఆఫ్ చేసే ఉంచారు. వారిలో టీపీఎస్‌లు బుధవారం నుంచి శనివారం వరకు డ్యూటీలకు డుమ్మాకొట్టారు. శనివారం ఎవరూ విధులకు హాజరుకాలేదు.

అనుమతులపై ఫిర్యాదులు..

టౌన్‌ప్లానింగ్ విభాగంపై (మిగతా 8లో..)

వయోవృద్ధులు

కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఇందూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని వారి అనుభవం, జ్ఞానం యువతకు దారి చూపే వెలుగని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో న్యూఅంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కుటుంబ నిర్మాణ (మిగతా 8లో..)



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

క్రైం సమాచారం



అంబులెన్స్‌కు సమాచారం అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే

మానవత్వం చాటుకున్న కోరుట్ల ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్ర శివారులోని గాంధీనగర్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. టీవీఎస్ మోపెడ్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా అదే సమయంలో అటుగా వెళ్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన కాన్వయిని అక్కడే ఆపి క్షతగాత్రుల పరిస్థితిని పరిశీలించారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్‌ద్వారా సమాచారం అందించి దగ్గరుండి ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలం చేరుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారు కోరుట్లకు చెందిన వారిగా గుర్తించారు.

అక్రమంగా మొరం తవ్వకాలు

» అర్ధరాత్రి టిప్పర్ల ద్వారా తరలింపు » అడ్డుకున్న స్థానికులు



గోదాంల వెనుక ఖాళీస్థలంలో మొరం తవ్వకాల దృశ్యం

నిజామాబాద్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని రాంనగర్ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. శనివారం, ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అక్రమంగా మొరం తవ్వకాలు సాగిస్తున్నారు. రాంనగర్‌లోని గోదాంల వెనుక స్థలంలో జేసీబీలతో మొరం తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో రాంనగర్, శాస్త్రినగర్‌వాసులు టిప్పర్లను అడ్డగించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. అధికార పార్టీకి చెందిన నేతలు, తవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏక్తాయాత్రకు బయలుదేరిన ప్రతినిధులు

నిజామాబాద్‌కల్చరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుజరాత్‌లో జరుగుతున్న యూనివర్సిటీ ఆఫ్ మాస్ యాత్రకు జిల్లా ప్రతినిధులు బయలుదేరారు. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సర్దార్ అభిమానుల బస్సుయాత్రను డిచ్‌పల్లి వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 23 నుంచి డిసెంబరు 1వ తేదీవరకు బస్సుయాత్రలు ప్రారంభమవుతున్నాయని అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, వినోద్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

బోర్డులకే పరిమితమా..?

» నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు » కానరాని క్రీడా సామగ్రి, వసతులు » గ్రామీణ యువత ఇబ్బందులు » పట్టించుకోని అధికారులు

వేల్పూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. క్రీడా పరికరాలు కూడా కొన్ని గ్రామ పంచాయతీలకు అందించారు. క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేయడంలో ఉన్న శ్రద్ధ వాటిని వినియోగంలోకి తెచ్చే అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు అన్ని కూడా బోర్డులకే పరిమితమయ్యాయి. దీంతో క్రీడాప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, గడ్డి ఏపుగా పెరిగి నిరుపయోగంగా మారాయి.

మండలంలో ఇలా..

మండలంలోని పలు గ్రామాలలో క్రీడా ప్రాంగణాల పరిస్థితి దయానీయంగా మారింది. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఇతర క్రీడలకు సంబంధించి కోర్టులు, పోల్స్ ఏర్పాటు చేసి వదిలేశారు. క్రీడా ప్రాంగణాలు పలు గ్రామాలలో స్థలం కొరత వల్ల గ్రామానికి దూర ప్రాంతాల్లో, అలాగే పాఠశాలల ఆవరణలో పెద్ద బోర్డులు పెట్టి ఇదే క్రీడాప్రాంగణం అంటూ అధికారులు చేతులు దులుపుకొన్నారు. మొదట్లో ఖోఖో, వాలీబాల్, లాంగ్ జంప్, కబడ్డీ తదితర ఆటలకు సంబంధించి ఏర్పాటు చేసిన కోర్టులు ప్రస్తుతం కనిపించడం లేదు. మోతెలో క్రీడాప్రాంగణం స్థలం వాహనాల పార్కింగ్‌గా తయారైంది. కోమన్‌పల్లిలో ప్రాంగణ స్థలం పశువుల మంద కోసం వినియోగిస్తున్నారు. చాలా గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అనుకూలంగా లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకొచ్చి, క్రీడాకారులకు మేలు చేయాలని కోరుతున్నారు.



మోతెలో పార్కింగ్ స్థలంగా మారిన క్రీడా ప్రాంగణం

ఆట స్థలాలను వినియోగంలోకి తేవాలి

- రిగ్గు నర్సారెడ్డి, వేల్పూర్

ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వం వినియోగంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. దానివల్ల గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. అందుకు చర్యలు చేపట్టాలి.

త్వరలో చర్యలు తీసుకుంటాం..

- బాలకిషన్, ఎంపీడీవో, వేల్పూర్

మండలంలో అనువుగా ఉన్న క్రీడా ప్రాంగాణాలను త్వరగా వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇదివరకే ఆదేశాలు జారీ చేశాం. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం వినియోగంలోనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో గ్రామానికి దూరంగా ఉన్న ప్రాంగణాలకు క్రీడాకారులు వెళ్లకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచన మేరకు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.



వైద్య శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

ఉచిత కంటి పరీక్షలు

వర్ని, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ని, బోధన్ ఆధ్వర్యంలో అన్నదానం, కంటి పరీక్షలు నిర్వహించారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. వందలాది మంది కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్షలు చేసుకుని వైద్యుల సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నగేష్, నరసయ్య, నవీన్‌రెడ్డి, వివేకా నగేష్, తదితరులున్నారు.

నేడు క్రీడాపోటీలు

నవీపేట,నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ పాఠశాల ఆవరణలో సోమవారం 69వ ఎస్‌జీఎఫ్ అంతర పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో అశోక్ తెలిపారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి పోటీలను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఎంఈవో వెల్లడించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

» రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



చీరలను పంపిణీ చేస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్, వేల్పూర్‌లో ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సారెడ్డితో కలిసి విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పంపిణీ ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరి కాకుండా ప్రస్తుతం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాణ్యమైన చీరలను మహిళలకు అందజేయడం ఆనందదాయకమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, సన్నరకం బియ్యం పంపిణీ, తదితర పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మహిళలందరినీ కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు. మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. స్త్రీ సాధికారత సాధించినప్పుడే అన్ని కుటుంబాలు బాగుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నరేందర్, సొసైటీ డైరెక్టర్ ఏలేటి రాజేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రమేష్, మేతరి రాజేందర్, రాజేశ్వర్, లావణ్య, లహరి, ఏపీఎం మాణిక్యం, సీసీ మురళి, కాంగ్రెస్ నాయకులు మోహన్, గంగాధర్, నర్సారెడ్డి, లింగేశ్వర్, నెహ్రూ, గంగారెడ్డి, జీజీ రెడ్డి, కిషోర్ గౌడ్, శ్రీనివాస్, వినోద్, మల్లేష్, దామోదర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, రేవంత్‌రెడ్డి, సతీష్, మహిళా సంఘాల మహిళలు, వీవోఏలు పాల్గొన్నారు.



ఐద్వా జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహాసభను జయప్రదం చేయాలి

» ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత

నవీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 14వ జాతీయ మహాసభలను వచ్చే సంవత్సరం జనవరి 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నామని, వాటిని విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐద్వా మహాసభలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని ఆమె పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ, మహిళ ఉద్యమాలకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొండపల్లి పుష్ప, రమ, సునీత, లక్ష్మి, విజయ, వహీదా తదితరులు పాల్గొన్నారు.



కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

'అమ్మమ్మ ప్రేమ' పుస్తకావిష్కరణ

ఏర్గట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని నూనె శ్రీనిధి రాసిన 'అమ్మమ్మ ప్రేమ' కథల పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ మందిరంలో అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిన వీరభద్రుడు, బాల సాహిత్య ప్రతినిధి గరిపల్లి అశోక్ ఆవిష్కరించారు. చక్కని కథలు రాసిన శ్రీనిధిని వారు అభినందించారు. శ్రీనిధిని సాహిత్యపరంగా ముందుకు తీసుకెళ్తున్న తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మను అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రెంజల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. ఆదివారం తాడ్‌బిలోలిలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అనారోగ్యానికి గురి కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులు అందించామన్నారు. మాజీ మండలాధ్యక్షుడు సాయిరెడ్డి, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్ యాదవ్, రామాలయ చైర్మన్ శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు నర్సయ్య, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, నాయకులు ఖుద్దుస్, బుక్క గంగాధర్, జుట్టు పోశెట్టి, అశోక్, సద్దాం, షఫీ, షేర్‌ఖాన్, నారాయణ తదితరులున్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అంజనేయులు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

కమ్మర్‌పల్లి , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లి బీసీ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి దుప్పట్ల సరఫరా నిలిచిపోవడంతో చలి నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు బషీరాబాద్‌కు చెందిన సత్యనారాయణ దాతల నుంచి సేకరించిన సుమారు 100 దుప్పట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ అంజనేయులు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, కమ్మర్‌పల్లి మండల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మహేష్, పురుషోత్తం, సత్యనారాయణ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛభారత్

ఆర్మూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణం జిరాయత్ నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహం ఆవరణ, పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. విద్యార్థినిలకు పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విద్యార్థినులు

ఉత్సవం.. ఊరంతా సంబురం

» అంబంలో 25 నుంచి గజ్జెలమ్మ జాతర » కొనసాగుతున్న ఏర్పాట్లు

రుద్రూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబంలో ఏటా నిర్వహించే గజ్జెలమ్మ జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 25, 26వ తేదీల్లో ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఏళ్ల క్రితం నుంచి ఆనవాయితీగా ఈ జాతర ఉత్సవాలను నిరాటంకంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ శివారులోని పచ్చని పంట పొలాల నడుమ గజ్జెలమ్మ ఆలయం ఉంది. ప్రకృతి వాతావరణంలో సందడిగా జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. తమ గ్రామాన్ని గజ్జెలమ్మ సుభిక్షంగా ఉంచుతుందన్న నమ్మకంతో గ్రామస్థులు ఈ ఉత్సవాలు ప్రతి సంవత్సరం నవంబరులో వైభవంగా నిర్వహిస్తారు.



గజ్జెలమ్మ తల్లి

రెండు రోజుల పాటు..

సోమవారం అర్ధరాత్రి నుంచి గజ్జెలమ్మ ఉత్సవాలు ప్రారంభవుతాయి. గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ చావిడి వద్దకు చేరుకుంటారు. అనంతరం గ్రామ దేవతలకు జంతు బలి ఘట్టంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. మంగళవారం తెల్లవారుజామున పోతురాజుల విన్యాసాలతో గజ్జెలమ్మ ఆలయానికి తరలివెళ్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే గ్రామంలోని మరిగమ్మ, పోచమ్మ, ఊరడమ్మ, కట్ట రాజులు, కట్ట మైసమ్మ, ఎల్లమ్మ తల్లి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తారు. మంగళవారం మధ్యాహ్నం హనుమాన్ మందిరం వద్ద రథాన్ని అలంకరించి గజ్జెలమ్మ ఆలయం వరకు డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్తారు. అనంతరం ఆలయం చుట్టూ రథంతో ప్రదక్షిణ నిర్వహిస్తారు. రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారు. గజ్జెలమ్మ జాతరలో ఆలయం వద్ద పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకుంటాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, పెద్ద ఎత్తున జాతర కొనసాగుతుంది.

కులమతాలకు అతీతంగా వేడుకలు..

గ్రామంలో జరిగే గజ్జెలమ్మ జాతర ఉత్సవాలను కుల, మతాలకు అతీతంగా ఉత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తాం. గజ్జెలమ్మ జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. పాడిపంట బాగుండాలని, ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

- మహేష్, గ్రామపెద్ద



ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి

బోధన్: బోధన్‌లోని విజయమేరి పాఠశాలలో సోమ, మంగళవారాల్లో జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ తెలిపారు. ఆదివారం బోధన్‌లోని విజయమేరి పాఠశాలలో జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి వివిధ కేటగిరిలలో పాల్గొనే విద్యార్థుల రిజిస్ట్రేషన్‌లు సేకరించడం జరిగిందన్నారు. జిల్లాలోని పలు పాఠశాలల నుండి శాస్త్రీయ ప్రాజెక్టులు, మోడల్స్ ఇనొవేషన్, పర్యావరణ సాంకేతిక విభాగాలలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో నమోదు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకత ఆలోచనలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరమని జిల్లా సైన్స్ అధికారి తెలిపారు. అన్ని పాఠశాలల వారు సమయానికి హజరై ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంఈవో నాగయ్య, సాలూర ఎంఈవో రాజమంజూష, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అవ్వకు బువ్వ

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్ విద్య హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛంద సంస్థ సేవా ఆధ్వర్యంలో ఆదివారం అవ్వకు బువ్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద వృద్ధులకు 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేపట్టారు. సుమారు 54 మంది వృద్ధులకు బియ్యాన్ని అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు విద్య ప్రవీణ్‌పవార్, నరహరి, గోపికృష్ణ, శ్రీధర్, గంగాధర్, తులసి, శ్రావణ్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ

భీమ్‌గల్ రూరల్: మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో ఆదివారం పెద్దంగంటి ఎల్లమ్మ ఆలయంలో నూతన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్చరణలతో కన్నుల పండువగా జరిగింది. గ్రామం నుంచి ఆలయానికి మహిళలు మంగళహారతులు, బోనాలతో డప్పుచప్పుళ్లతో వచ్చి అమ్మవారికి పట్టువస్త్రాలు సమలేపించి, బెల్లం, అన్నం బూరెలు, నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం



మంజూరు పత్రాలు అందజేస్తున్న సునీల్‌కుమార్

వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పేద కుటుంబాలకు వరం లాంటిదని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పడిగెల గ్రామంలో రెండవ విడత కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించి ఇళ్ల నిర్మాణాల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేద బడుగు బలహీన మైనార్టీల వర్గాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల కమిటి సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

నవీపేట: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో పలువురు నిరుపేదలకు రగ్గులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచార జాతుల ప్రజలు దీనమైన పరిస్థితులలో జీవిస్తున్నారని అన్నారు. వారి సంక్షేమానికి విద్య, వసతి, ఉపాధి వంటి అవకాశాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిట్టాపల్లి చిరంజీవి, విశ్వేశ్వర్, సృజన్, శరత్, నవీన్ రాజ్, ప్రవీణ్ కుమార్, చింతల సాయన్న తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో బీజేపీ నాయకులు

బోధన్: బోధన్‌లోని పాన్‌గల్లీ సమీపంలో పెద్ద పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారీ, ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో బోధన్ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గోపి కిషన్, బుద్ధ సంగ్రామ్ పటేల్, ప్రవీణ్, అనిల్, గౌతం తదితరులున్నారు.

కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడికి సన్మానం

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో నిజామాబాద్ నగర కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొబ్బిలి రామకృష్ణను జంబి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికైన నిజామాబాద్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణను పట్టు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జంబిహనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ, జంగిడి బోజన్న, నవీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దొన్కల్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మోర్తాడ్: మండలంలోని దొన్కల్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులను మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం అనిల్, రాజ్‌కుమార్, రవి, ముత్యం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల అందజేత

నవీపేట: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రులలో స్థానిక ప్రైవేట్ హాస్టల్ యాజమాని దేవేందర్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నేత పార్థివదేహానికి నివాళి

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు ఉమ్మెడ మల్లికార్జున్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ ఆదివారం ఆయన లక్కోర గ్రామానికి చేరుకొని మల్లికార్జున్ పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢా సానుభూతి, సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పతకం సాధించిన గడాల దేవాన్ష్‌ను అభినందిస్తున్న అదనపు డీసీపీ బస్వారెడ్డి

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన తల్లి, కొడుకు

భీమ్‌గల్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలను ఆదివారం నిర్వహించారు. కాగా ఈ పోటీల్లో తల్లి, కొడుకులు అద్భుత ప్రతిభ కనబర్చి వేర్వేరు విభాగాల్లో పలు పథకాలు సాధించి అబ్బురపరిచారు. షార్ట్‌పుట్ విభాగంలో గడాల అనిత గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. కాగా ఆమె కుమారుడు గడాల దేవాన్ష్ 100 మీటర్ల పరుగుపందెంలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన తల్లీకొడుకును నిజామాబాద్ అదనపు డీసీపీ బస్వారెడ్డి అభినందించారు.

మహిళల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న నాయకులు

జుక్కల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ పేర్కొన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో డ్వాక్రా గ్రూపు మహిళలకు ఆదివారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘ సభ్యులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన మహిళలందరికీ చీరలు అందిస్తున్నామన్నారు. జుక్కల్ మండలానికి 6 వేల చీరలు వచ్చాయని, త్వరలోనే గ్రామాలకు ఐకేపీ సిబ్బంది వెళ్లి ప్రతి మహిళకు చీరలు ఇస్తామన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఉపాధి కల్పించడానికి పాడిపశువులు, వివిధ వ్యాపారాల్లో అభివృద్ధి చేయడానికి శ్రీనిధి నుంచి రుణాలు ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గంగారం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.75 వేల విరాళం



అయ్యప్ప నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అయ్యప్ప నిత్యాన్నదాన సేవా ట్రస్టుకు ఆదివారం కుక్కునూరి భూపతి కుటుంబ సభ్యులు రూ.75వేల విరాళం అందజేశారు. వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్‌కు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప నిత్యాన్న సేవాట్రస్టుకు దాతలు ముందుకు వచ్చి విరాళం అందించడం ఆనందంగా ఉందన్నారు. దాతల సహకారంతో అయ్యప్ప ఆలయంలో నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు తాటి ప్రశాంత్, ర్యాల విఠల్‌రెడ్డి, శ్రీధర్, సంజీవ్ కుమార్, ఆనంద్, శంకర్‌గౌడ్, మధు, చిదుర సురేందర్ తదితరులున్నారు.

బాన్సువాడలో ఘనంగా బోనాల పండుగ



బాన్సువాడలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

బాన్సువాడటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో ఆదివారం మహిళలు భూలక్ష్మమ్మ అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. నెత్తిన బోనమెత్తి పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాత బాన్సువాడలోని భూలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అందరినీ సల్లంగ సూడు తల్లీ అంటూ మనస్ఫూర్తిగా వేడుకున్నారు. పాడిపంటలు, ఆరోగ్యాలు బాగుండాలంటూ కోరుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లించాలి



బీర్కూర్‌లో మాట్లాడుతున్న రేషన్ డీలర్లు

బీర్కూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే స్పందించి రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్ చెల్లించాలని బీర్కూర్ మండల రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో రేషన్ డీలర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గత 6 నెలలుగా రేషన్ డీలర్లకు చెల్లించాల్సిన కమీషన్ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది నెలలుగా రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వ ఉందన్నారు. ఆ బియ్యాన్ని వెనక్కు తీసుకోకపోవడం వల్ల దొడ్డు బియ్యం పురుగులు పట్టి పాడవుతుందన్నారు. సన్న బియ్యానికి కూడా ఆ పురుగులు చేరి పాడవుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కాకుండా ప్రతీ నెల రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిసెంబరు 1న భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణ



బీర్కూర్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ చౌరస్తాలో డిసెంబరు 1న స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. ఆదివారం విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాలను యువకులు విడు దల చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాల్ రాజ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సు లోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొని బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన గొప్ప వీరుడు భగత్‌సింగ్ అని అన్నారు. ఇలాంటి పోరాట పటిమ కలిగిన వీరుడు భగత్‌సింగ్‌ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, అయన పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. డిసెంబర్ 1న బీర్కూర్ భగత్ సింగ్ చౌరస్తాలో జరగబోయే భగత్ సింగ్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి విద్యార్థులు, యువకులు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. టీఎస్‌పీ జిల్లాధ్యక్షుడు శ్రీకాంత్, పీడీఎస్‌యూ నాయకులు సాయి, అరవింద్, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు వినోద్, మాజీ ఎంపీటీసీ సందీప్, రఘు పాల్గొన్నారు.

చీర కావాలంటే.. ఫొటో దిగాల్సిందే

▸▸ ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి ప్రభుత్వ నిబంధన



చీర అందించే ముందు ఫొటో తీసుకుంటున్న వీబీకే

మద్నూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి అధికారులు ప్రత్యేక నిబంధన పెట్టారు. చీరలు పంపిణీ చేసేముందు లబ్ధిదారులు తప్పనిసరిగా ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో ఫొటో దిగాలనే నిబంధన విధించింది. అయితే చీరల పంపిణీలో పారదర్శకత కోసమే ఈ నిబంధన పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందజేసే చీరను పొందాలంటే కచ్చితంగా విలేజ్ బుక్ కీపర్ (వీబీకే)ల వద్ద ఉండే మొబైల్ ఫోన్‌లోని యాప్‌లో ఫొటో దిగాల్సి ఉంటుంది. లేదంటే చీర పొందడం కుదరదు. ఇందిరా మహిళా శక్తి చీరలను పొందాలంటే మహిళలు సెర్ప్ ప్రొఫైల్ అనే యాప్‌లో ఫొటో దిగాల్సి ఉంది. ఇప్పటికే వీబీకేలు వారి మొబైల్ ఫోన్‌లలో ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. చీర అందజేయాలంటే యాప్‌లో గ్రామం, కోడ్ నంబర్, మహిళా సంఘం పేరు నమోదు చేయగానే సంఘంలోని సభ్యుల వివరాలు వస్తాయి. జాబితాలోని సదరు మహిళ పేరుపై క్లిక్ చేసి చీరను అందుకునే మహిళ ఫొటోలు క్యాప్చర్ చేయాలి. అది విజయవంతంగా నమోదై వివరాలు, ఫొటోతో సహా యాప్‌లో నిక్షిప్తమవుతాయి. ఆ తర్వాతే మహిళకు చీరను వీబీకే అందిస్తారు. దీంతో పాటు మరో రిజిస్టర్‌లో పేరు, ఆధార్ వివరాలు నమోదుచేస్తారు. ఇలా చీరలను మహిళలకు పంపిణీ చేస్తున్నారు.

పాఠశాల నిర్మించి.. ప్రహరీ మరిచి



బీర్కూర్‌లో ఎంజేపీ గురుకులం ఇదే..

బీర్కూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ గురుకులంలో ఇంటర్ వరకు విద్యనభ్యసించే అవకాశం ఉంది. కాగా టీచింగ్ స్టాఫ్ 25, నాన్ టీచింగ్ స్టాఫ్ 5 ఉన్నారు. పాఠశాలలో మొత్తం సుమారు 530 మంది పైచిలుకు విద్యార్థులున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ పాఠశాల చుట్టూ రక్షణగా ఉండాల్సిన ప్రహరీ లేదు. దీంతో రాత్రివేళల్లో ఆకతాయిలు పాఠశాల ఆవరణలోకి నేరుగా వస్తున్నారు. మద్యం సేవిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం వేళలో మద్యం సీసాలు, కవర్లు చిందర వందరగా పడి ఉంటున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా విద్యార్థులు కూడా బయటవెళ్లి వస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నేరుగా కలిసి మాట్లాడుతున్నారు. దీంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని సిబ్బంది తెలిపారు. మరోవైపు అదనపు గదుల కొరత సైతం వేధిస్తోంది. విద్యార్థులు భోజనాలు చేసేందుకు డైనింగ్ హాల్ కూడా లేదు. కింది గదిలో భోజనాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పాఠశాల చుట్టూరా ప్రహరీ నిర్మాణంతో పాటు మిగతా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివ మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రహరీతో పాటు చిన్న పాటి సమస్యలున్నాయి. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వెంకన్న ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పిట్లం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర ఆలయాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయకమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో 3 రోజులపాటు ఘనంగా వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణరెడ్డి, బలరాం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ బోర్డు ఏర్పాటు చేయాలి

▸▸ తెలంగాణ రాష్ట్ర హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సామ్రాజ్యం



సమావేశంలో మాట్లాడుతున్న హమాలీ వర్కర్లు

బీర్కూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర హమాలీ వర్కర్స్ యూనియన్ బోర్డును ఏర్పాటుచేయాలని రాష్ట్ర హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సామ్రాజ్యం డిమాండ్ చేశారు. ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలో హమాలీ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో 90 మంది హమాలీలు యూనియన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడబ్ల్యూయూటీ సంఘంలో రాష్ట్రవ్యాప్తంగా 70వేల మంది హమాలీలు సభ్యులుగా ఉన్నారన్నారు. సంఘం డిమాండ్ మేరకు 2023 ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ హమాలీ వర్కర్స్ యూనియన్ బోర్డు ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తుచేశారు. కాగా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అవుతున్నా హమాలీ బోర్డు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వెంటనే బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదకొండేళ్లు గడుస్తున్నా హమాలీలకు ఎలాంటి గుర్తింపు బోర్డు గానీ, సంక్షేమ పథకాలు గానీ ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో బీర్కూర్ మండల హమాలీ యూనియన్ నాయకులు భూమన్న, హన్మండ్లు, హమాలీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

ఆదుకున్న స్నేహితులు

భిక్కనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన నర్సింలు ఇటీవల మరణించాడు. ఈ మేరకు 2002-2003 బ్యాచ్ పదవతరగతికి చెందిన మిత్రులు కలిసి రూ.20,500 ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని, నిరుపేద కుటుంబమైన నర్సింలు కుటుంబానికి దాతలు సహాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో యోసఫ్

నేడు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

సదాశివనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలో సోమవారం (నేడు) జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎంఈవో యోసఫ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఉదయం 11 గంటలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, డీఈవో రాజు హాజరవుతారన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులు హాజరయ్యేలా పాఠశాలల యాజమాన్యాలు, హెచ్‌ఎంలు కృషిచేయాలన్నారు.



దీక్షను విరమిస్తున్న బీసీ నాయకులు

ముగిసిన రిలే నిరాహార దీక్ష

ధర్పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధర్పల్లి మండల కేంద్రంలో గత 4 రోజులుగా కొనసాగిన రిలే నిరహార దీక్షలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మండల బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 42శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలంటూ బీసీ నాయకులు చేపట్టిన నాయకులు నిమ్మరసంతో దీక్షను విరమించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో మహిళలు బతుకమ్మ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, నర్సయ్య, బాలయ్య, నవీన్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపి వేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

సిరికొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను లేకుండా చేయడానికి చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఆపివేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్రనాయకులు రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీ నాయకులను వేటాడి చంపడం సరైన పద్ధతి కాదన్నారు. మావోయిస్టు నేతలు, కార్యకర్తలు కూడా భారతీయులే అని, పరాయిదేశం వారిలా చూస్తూ వేలాది మంది సైనిక బలగాలతో దళాలను మట్టుబెట్టడం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అడవులన్నీ పోలీసుక్యాంపులతో నింపి వేయడమంటే ఆదివాసుల హక్కులను హరించి వేయడమేనని అన్నారు. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం డెడ్‌లైన్ ప్రకటించుకుని ఎన్‌కౌంటర్‌ల పేరుతో ఏకపక్షంగా కాల్చి చంపడం దారుణమన్నారు. అనారోగ్యంతో ఉండి చికిత్సా కోసం విజయవాడకు వచ్చిన మాడ్వి హిడ్మాను పట్టుకుని కాల్చిచంపడాన్ని రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మాస్‌లైన్ జిల్లా నాయకులు రమేష్, డివిజన్ నాయకులు దామోదర్, కిషోర్, లింబాద్రి, ఎస్.కిషోర్, అనీస్, భూమగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

కామారెడ్డి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులోని నల్లకుంట మైసమ్మ తల్లి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చినట్లు ఆలయ పూజారి తెలిపారు. ఆదివారం అమ్మవారికి పర్వదినం కావడంతో ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం, బోనాలు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లుచేశారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

▸▸ లింగంపేట మండలానికి 9,456 చీరలు



ఐలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగంపేట, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని పొల్కంపేట, ఐలాపూర్‌లతో పాటు పలు గ్రామాలలో ఆదివారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఐలాపూర్‌లో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. లింగంపేట మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు మొత్తం 9456 చీరలు వచ్చినట్లు ఐకేపీ ఏపీఎం వినోద్ తెలిపారు. క్లస్టర్ల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.. ఐలాపూర్ గ్రామానికి 997, భవానిపేట గ్రామానికి 1537, కోర్పోల్ గ్రామానికి 1193, లింగంపల్లి గ్రామానికి 1215, లింగంపేట గ్రామానికి 1046, పోతాయిపల్లి గ్రామానికి 1318, శెట్పల్లి గ్రామానికి 960, శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి 1190 చీరలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. మరో రెండు రోజుల్లో 5 వేల చీరలు అదనంగా వస్తున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ వాహబ్, శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్, అశోక్, రవి, భైరయ్య, దేవేందర్, ఐకేపీ సీసీ గంగరాజు, కార్యదర్శి అశ్వక్‌లతో పాటు నాయకులు ఉన్నారు. సోమవారం లింగంపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీదుగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు.

ఘనంగా సత్యసాయి జయంతి



ధర్పల్లిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న బాలవికాస్ చిన్నారులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నామ్‌దేవ్‌వాడ సత్యసాయి సేవాసమితిలో ఉదయం ధ్వజారోహణ చేసి నగర సంకీర్తన నిర్వహించారు. సమితి ఆవరణలో సామూహిక వ్రతాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సత్యసాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో ఉంచి డోలారోహణ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కన్వీనర్ భస్కర్, చంద్రకాంత్, గంగాధర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వేడుకలు

సుభాష్‌నగర్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతిని



నిజామాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు

పురస్కరించుకుని ఆదివారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా వేడుకలు నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని, సత్యసాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. భగవాన్ సత్యసాయి బాబా జీవిత విశేషాలు, బోధనలు, సేవా నిరతిని గుర్తు చేసుకున్నారు. వేడుకల సందర్భంగా సత్యసాయి బాబా సేవా సమితి ప్రతినిధులు భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా సమితి ఆధ్వర్యంలో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు అధికారికంగా నిర్మించడం పట్ల సమితి అధ్యక్షుడు డా.శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, ఎస్.ఐ.సీ అధికారి మధు పాల్గొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో..

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ వనజారాణి సిబ్బంది తిరుపతి రమేష్ వీరయ్య పాల్గొన్నారు.

ధర్పల్లి సేవాసమితి ఆధ్వర్యంలో..

ధర్పల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధర్పల్లి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సత్యసాయిబాబా పల్లకీ సేవను నిర్వహించారు. అంతకుముందు సత్యసాయి సదన్‌లో ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం బాల వికాస్ చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు మండలస్థాయిలో కళాశాల, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం స్వామివారి డోలయాను, గురు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ధాన్యం తరలింపునకు కృషి చేస్తా

▸▸ కామారెడ్డి జిల్లా సహకార అధికారి రామ్మోహన్

రామారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలకేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని కామారెడ్డి జిల్లా సహకార అధికారి రామ్మోహన్, సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అన్నదాతలు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో తరలించేలా కృషిచేస్తామని తెలిపారు. సివిల్ సప్లై డీఎంకు ఫోన్ చేసి లారీల సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాల, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ అమ్ముల పశుపతి, డైరెక్టర్లు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, సీఈవో భైరయ్య, సిబ్బంది లింగమూర్తి, నవీన్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



పీసీసీ చీఫ్ మహేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డితో నగేష్‌రెడ్డి

కాంగ్రెస్ పెద్దలను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

నిజామాబాద్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియామకమైన కాటిపల్లి నగేష్‌రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డిని కలిశారు. తనపై నమ్మకం ఉంచి తనను డీసీసీ అధ్యక్ష పదవికి ఎంపిక చేసినందుకు ఆదివారం జిల్లాకేంద్రంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటానని, సమర్థవంతంగా పార్టీని క్షేత్రస్థాయిలో తీసుకెళ్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గెలిపిస్తానని మాట ఇచ్చారు.



కళాప్రదర్శన ఇచ్చిన విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

సమాజం కోసమే కళాకారులు

▸▸ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ

నిజామాబాద్‌కల్చరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధి కోసం కళాకారులు తమ జీవితాన్ని ధారపోస్తారని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ప్రజా నాట్యమండలి 10వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వాలు కళాకారుల అభివృద్ధి కోసం ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధి కోసం పాటుపడే కళాకారులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో కళాకారులు ముందు వరుసలో ఉంటారన్నారు. కళాకారులను ఎప్పుడూ తమ చేతుల్లో ఉంచుకోడానికి ప్రయత్నం చేయవద్దని స్వేచ్ఛగా ఉండనివ్వాలన్నారు. దాశరథి వంటి ఎందరో మహానుభావులను చైతన్యవంతులు చేసిన ఇందూరు గడ్డ కళాకారులకు కొదవలేదన్నారు. అంతకుముందు కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, రాజయ్య, నర్సారెడ్డి, మల్లన్న, పోశెట్టి, డాక్టర్ భరత్, సాయిబాబు, పెద్ది వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



తాళ్ళరాంపూర్‌లో చీరలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మోర్తాడ్‌లో పంపిణీ చేస్తున్న దృశ్యం



సిరికొండలో చీరలు అందజేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ చీరల పంపిణీ షురూ

నిజామాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జిల్లాలో ఊపందుకుంది. జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మహిళా సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఐకేపీ అధికారులు, సిబ్బంది ఆదివారం జిల్లాలోని మండలాల్లో ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు ఇందిరమ్మ చీరలు అందజేశారు. జిల్లాకు ఇప్పటి వరకు 2.57 లక్షల ఇందిరమ్మ చీరలు వచ్చాయని, మరో 50 వేల చీరలు రానున్నాయని అధికారులు తెలిపారు.



కమ్మర్‌పల్లిలో ..



అభంగపట్నంలో చీరలను అందజేస్తున్న దృశ్యం



మోపాల్: చీరలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

సుభాష్‌నగర్, నంబరు 23, (ఆంధ్రజ్యోతి): గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ కేడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను చాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి హాజరై, మాట్లాడారు. దేశభక్తి, సమాజసేవ, నాయకత్వం వంటి లక్షణాలు యువతలో పెంపొందించి ఉత్తమ సమాజం రూపొందించడానికి ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. లెఫ్టినెంట్ డాక్టర్ ఎం.రామస్వామి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ఐక్యత నినాదంగా కొనసాగే ఎన్‌ఈసీ పపంచంలోని అతిపెద్ద యూనిఫామ్ యూత్ ఆర్గనైజేషన్ అని, సెకండ్ లైన్ ఆఫ్ ఆర్మీ అని కొనియాడారు. అనంతరం క్యాడేట్లు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యక్తిగత నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కెప్టెన్ బాబురావు, డాక్టర్ రంజిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌సీసీ డేలో పాల్గొన్న గిరిరాజ్ కళాశాల కేడెట్లు, అధ్యాపకులు

ఈత పోటీల్లో స్వర్ణ పతకాలు

సిరికొండ,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒరిస్సాలో జరిగిన జాతీయస్థాయి ఈత పోటీల్లో స్వర పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను ఆదివారం తాటిపల్లి యువకులు ఘనంగా సన్మానించారు. తాటిపల్లి గ్రామానికి చెందిన మాలవత్ విశాల్, భూక్యా దీపక్‌కుమార్ సిరిసిల్లా జిల్లా కోనరావుపేట్ మండలం మరిమడ్ల ఏకలవ్య రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యభ్యాసం చేస్తున్నారు. ఒరిస్సాలో జరిగిన జాతీయ ఈత పోటీల్లో విశాల్ 100 మీటర్లు, దీపక్‌కుమార్ 200 మీటర్ల ఈత పోటీలో స్వర్ణ పతకాలు సాధించారు. వారిని ఆదివారం తాటిపల్లి వీడీసీ సభ్యులు, యువకులు అభినందించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ ప్రకాష్, వైస్ చైర్మన్ సాగర్, సభ్యులు చలపతి, గంగాధర్, రమేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న తాటిపల్లి గ్రామ యువకులు



సంజయ్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న లలిత

సంజయ్‌ని కలిసిన మాజీ ఎమ్మెల్సీ లలిత

నిజామాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మేయర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ధర్మపురి సంజయ్‌ను మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత అభినందించారు. ఆదివారం జరిగిన ప్రమాణస్వీకారం ఉత్సవంలో సంజయ్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని లలిత ఆకాంక్షించారు.



పార్టీ కండువా కప్పి వేస్తున్న పీసీసీ చీఫ్

కాంగ్రెస్‌లో చేరిన కిషన్

నిజామాబాద్‌సిటీ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు న్యాలం కిషన్ కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో న్యాలం కిషన్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. న్యాలం కిషన్ మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు ముఖ్య అనుచరుడిగా, జిల్లా బీఆర్ఎస్ నగర అధ్యక్షుడిగా సైతం ఉండేవారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

గ్రామ కమిటీ, ఆలయ కమిటీ నిర్వాహకులను అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోధన్ అభివృద్ధి కోసం 18కోట్లు కేటాయించారని వాటితో వాటర్ ప్లాంట్‌లో ప్రజల సౌకర్యార్థం తాగునీటి కోసం కోటిన్నర రూపాయలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్లాంట్‌ను నిర్మిస్తామన్నారు. బోధన్ మున్సిపాలిటీ నూతన బిల్డింగ్ నిర్మాణ పనులు చేపడతామన్నారు. మాజీముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ నీళ్లు వచ్చేటట్లు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, రైతులకు బోనస్‌లను అందజేస్తుందన్నారు.

సోలార్ ప్లాంట్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

బోధన్ ప్రజలు సోలార్ ప్లాంట్ ద్వారా ప్రభుత్వ రాయితీ పొంది సోలార్‌లను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రత్యేక సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్‌లోని కెనరా బ్యాంక్ సమీపంలో ప్రపంచ సోలార్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ద్వారా ఆదా అవుతుందని సోలార్ వల్ల కలిగే లాభాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లయ్య, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, మారుతి మందిరం చైర్మన్ గుండెటి శంకర్, శరత్ రెడ్డి, ప్రదీప్ గుప్తా,ప్రతాప్ గుప్తా, బీర్కూర్ బుజ్జి, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

(5వ పేజీ తరువాయి)

జిల్లాకేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడుతూ.. బీజేపీకి బీహార్ ఎన్నికల విజయం తర్వాత అత్యధిక మెజార్టీ ట్రేడ్ యూనియన్లు పూర్తిగా వ్యతిరేకించిన కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని వివరించారు. కార్మిక వర్గానికి అనుకూలంగా ఉండే ఏ వాదనను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో అత్యధిక శాతం శ్రామిక శక్తి అసంఘటిత రంగంలో ఉందని మరియు దేశంలోని అధిక శాతం ఉద్యోగాలు తాత్కాలికమైనవి. తక్కువ మంది మాత్రమే కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి ప్రయోజనాలు పొందుతున్నారు అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను ఉల్లంఘిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.భూమన్న, హరిత, అరుణ, రాములు, జేపీ గంగాధర్, శివకుమార్, సుప్రియ, రాధా, గంగాధర్, పరశురాం, వివిధ సంఘాల తదితరులు పాల్గొన్నారు.

బల్దియాపై ఏసీబీ నిఘా

(5వ పేజీ తరువాయి)

ఆది నుంచి అవినీతి ఆరోపణలున్నాయి. ప్రధానంగా టీపీఎస్‌లుగా ఉన్న ఇద్దరు అధికారులపై లెక్కకు మించి ఫిర్యాదులు అందాయి. టీపీఎస్‌లుగా గతంలో పనిచేసినవారు, ప్రస్తుతం పనిచేస్తున్న ఇద్దరు అధికారులపై కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. అయినా, వారిపై అధికారులు చర్యలు తీసుకోలేదు. దాంతో వారు మరింత విచ్చలవిడిగా డబ్బులుతీసుకుని అనుమతులు ఇవ్వడం, సరియైన ధృవీకరణ పత్రాలు లేకున్నా, వివాదాల్లో ఉన్న స్థలాలకు అనుమతులు ఇవ్వడం వంటి అనుమతులపై ఫిర్యాదులున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలు సైతం వీరి వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్నారు. గతంలో ఎన్నోసార్లు పరోక్షంగా హెచ్చరించిన సందర్భాలున్నాయి. ఏసీబీ తనిఖీలతో అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఇప్పటికైనా విధుల్లో ఉంటారో లేదో చూడాలి.

కమిషనర్ స్థానంలో అడిషనల్ కలెక్టర్

బల్దియా స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా కలెక్టర్ కొనసాగుతుండగా కమిషనర్ దిలీప్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలను అడిషనల్ కలెక్టర్ అంకిత్ కుమార్ పర్యవేక్షించనున్నారు. ఆయన సోమవారం నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన పర్యవేక్షణలో అయినా బల్దియాలో అవినీతి, ఆక్రమణలు ఆగుతాయని నగరవాసులు చర్చించుకుంటున్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రజలకు ఇచ్చిన మెజార్టీ హామీలను నెరవేర్చామని మరిన్ని పథకాలను త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. ఈ పాటికే సన్న బియ్యం, రుణమాఫీ, ఉచిత బస్సు సౌకర్యం వంటివి జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ దూరదృష్టి లేకుండా కుప్పలు తెప్పలుగా అప్పులు చేశారని ఇప్పటికీ ప్రతీనెల రూ.6వేల కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. నందిపేటలో త్వరలోనే బస్సు డిపో నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు వస్తుందని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. నిజామాబాద్ జిల్లాకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఇంజినీరింగ్ కళాశాల, అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు చేశామని తరగతులు కూడా కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. సుమారు రూ.380 కోట్లతో ధర్మపురి నుంచి కొండగట్టుకు, కొండగట్టు నుంచి వేములవాడకు అక్కడి నుంచి భీమ్‌గల్ లింబాద్రి గుట్టకు అక్కడి నుంచి బాసర వరకు రోడ్ల అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. ముందుగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నందిపేట్‌లో బస్సు డిపో నిర్మాణం చేయాలని లేనిపక్షంలో ఐదు ఎకరాల స్థలాన్ని ప్రజలకు అవసరమయ్యే పార్కు లేదంటే యువకుల కోసం క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాలని కోరారు. లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, అంతిరెడ్డి రాజరెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు నాగేష్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, నేతలులు పూర్ణచంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శన్, లక్ష్మీనారాయణ, దేగాం గంగారెడ్డి, సాయిరెడ్డి, దొన్కం గంగారెడ్డి, మహిపాల్, చిన్నా పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే రహత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మారుమూల గ్రామమైన రహత్‌నగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, ఈ గ్రామంలో పుట్టి పెరిగినందుకు రుణం తీర్చుకుంటానని, తమ తల్లిదండ్రులు చేసిన సేవలు వల్లనే ఈ స్థాయిలో ఉన్నానని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని రహత్‌నగర్‌లో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి దేవదాయ ధర్మదాయశాఖ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించి, పనులకు మహేష్ కుమార్ గౌడ్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. మహేష్‌కుమార్ గౌడ్ స్వగ్రామమైన రహత్‌నగర్‌కు చేరుకోగానే గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి గజామాలతో స్వాగతం పలికారు. మహేష్‌కుమార్ గౌడ్ రహత్‌నగర్ గ్రామాభివృద్ధికి తన 11 ఎకరాల సొంత భూమిని విరాళంగా ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 10 ఎకరాలు, సబ్ స్టేషన్‌కు ఎకరం భూమి ఇచ్చానని, గ్రామానికి ఎంత సేవ చేసిన తక్కువేనని పేర్కొన్నారు. రహత్‌నగర్ మీదుగా కొండగట్టు, వేములవాడ, ధర్మపురి దేవాలయాలను కలుపుతూ టెంపుల్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో తమ గ్రామ అభివృద్ధి జరుగుతుందని, కరీంనగర్ నుంచి నిజామాబాద్ మధ్య ఈ గ్రామం సెంటర్ పాయింట్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, డీఆర్డీఓ ఏపీడీ మధుసూదన్, ఐకేపీ ఏపీఎం ప్రమీల, సీసీలు వర్దం శ్రీనివాస్, గడాల రఘుపతి, పురస్తు నరేష్, మండల కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులంతా ఏకం కావాలి

(5వ పేజీ తరువాయి)

వేస్తుందని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘంలో మున్నూరుకాపు సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా నిజామాబాద్ తొలి మేయర్, సీనియర్ కాంగ్రెస్ నేత ధర్మపురి సంజయ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి, మహ్మద్ అలీ షబ్బీర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ.. తనకు రాజకీయంగా ఓనమాలు నేర్పింది మాజీ పీసీసీ చీఫ్, దివంగత ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. తనకు రాజకీయ గురువు డీఎస్ అన్నారు. తాను పీసీసీ చీఫ్ అవుతానని డీఎస్ పదే పదే చెప్పేవారని, ఆయన జీవించి ఉన్న సమయంలో తాను పీసీసీ చీఫ్ అయితే తన గురువు డీఎస్ చాలా సంతోషపడేవారన్నారు. డీఎస్ కుమారుడు జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం గర్వంగా ఉందన్నారు. గతంలో అరుగుల రాజారాం, వి.హనుమంతరావు, డి.శ్రీనివాస్ వంటి వారిని పీసీసీ చీఫ్‌లుగా చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మున్నూరు కాపులందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి సంఘ భవనాలు నిర్మించిన చరిత్ర ఇందూరుకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంజయ్ నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన నాయకుడు, రాజకీయంగా అవకాశాలు రాలేదు, కానీ భవిష్యత్తులో ఉన్నత పదవులు వస్తాయన్నారు. తాను డీఎస్ ఒకేసారి రాజకీయ జీవితం ప్రారంభించామని, డీఎస్‌తో ఉన్న అనుబంధాన్ని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ గుర్తుచేసుకున్నారు. సంజయ్ నిఖార్సైన కాంగ్రెస్ నేత ఆయన మున్నూరుకాపు ముద్దుబిడ్డగా అన్ని బీసీ సంఘాలను కలుపుకొని పోయే సామర్థ్యం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్, గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మేయర్ సుజాత, కులాచారి దినేష్, ధర్మపురి సురేందర్, పుప్పాల శోభ, ఆకుల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

ఆశలు తారుమారు

(5వ పేజీ తరువాయి)

సంఖ్య 545కు పెరగడంతో రిజర్వేషన్‌లు కూడా మారే అవకావాలున్నాయి. రిజర్వేషన్‌లు రొటేషన్ పద్ధతిలోనే కేటాయించే అవకాశాలుండడంతో గతంలో ఉన్నవి మారే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆశావహులు తమ పంచాయతీ ఏవిధమైన రిజర్వేషన్ వస్తుందోనని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ చేసిన పంచాయతీల రిజర్వేషన్‌లలో పెద్దగా మార్పులు చేర్పులుండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. గతంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం పంచాయతీలకు, వార్డు సభ్యులకు రిజర్వేషన్‌లు ప్రకటించారు. ఇప్పుడు సైతం 2024 కులగణన ఆధారంగా రిజర్వేషన్‌లు ప్రకటించేలా జీవో ఇవ్వడంతో బీసీ రిజర్వ్ స్థానాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. బీసీతోపాటు జనరల్ స్థానాలు పెరిగే అవకాశాలు ఉండడంతో ఆశావాహులు పోటీకి సిద్ధమవుతున్నారు.

విద్యాహబ్‌గా బాన్సువాడ: పోచారం

(5వ పేజీ తరువాయి)

పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులతో పాఠశాలను నిర్మిస్తామన్నారు. 2700మంది విద్యార్థులు ఒకేచోట విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. మారుమూల ప్రాంతమైన పీఎస్ఆర్ నగర్ పాఠశాల నిర్మాణంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే చెక్‌పోస్టు నుండి హన్స వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 30కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. భూమిపూజ కార్యక్రమానికి ఉమ్మడి మండలం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, కాంగ్రెస్ నాయకులు ఏజాజ్ ఖాన్, శంకర్, వహీద్, మాధవరావు, గంగాధర్, బర్ల మధు, రాంబాబు, లింగాప్ప, హన్మంత్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ డా. కె. రంజిత

ఓపెన్ వర్సిటీ విద్యార్థులకు ఇండక్షన్

సుభాష్‌నగర్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల అధ్యయన కేంద్రంలో ఆదివారం డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ తరగతులు, పీజీ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ తీసున్న విద్యార్థులు, ఎంబీఏ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ యూనివర్సిటీ తరగతులు, కల్పించే వసతులను, నియమ నిబంధనలు విద్యార్థులకు అధ్యయన కేంద్ర కో-ఆర్డినేటర్ డా.కె. రంజిత తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. రామ్మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డా.కె.రంజిత, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వయోవృద్ధులు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలు

(5వ పేజీ తరువాయి)

మార్పులతో అనేక మంది పెద్దలు ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం వయోజనుల కోసం అమలు చేస్తున్న ఎల్డర్ లయన్ 14567, ఆరోగ్య శిబిరాలు, సీనియర్ సిటిజన్ హోమ్స్, డేకేర్ సెంటర్ వంటి పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైని కలెక్టర్ బస్వారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్, రెడ్‌క్రాస్, సీనియర్ సిటిజన్, తదితర సంఘాల ప్రతినిధులు, మహిళశిశు సంక్షేమశాఖ అధికారిణి రసూల్‌బీ తదితరులున్నారు.

సినిమా గైడ్

దేవి : రాజు వెడ్స్ రాంబాయి(11.15,2.15, 6.15, 9.15)
విజయ్ : ప్రేమంటే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సీసు రోడ్ ఆఫ్ రివేంజ్ (11.15,2.15,6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : కల్కి వనం (10.45)
: 12 ఏ రైల్వే కాలని (1.30, 7.30, 10.20)
: పాంచ్ మినార్ (4.30)
స్క్రీన్-2 : రాజు వెడ్స్ రాంబాయి (11.00)
: ప్రేమంటే (1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-3 : ది గర్ల్‌ఫ్రెండ్ (1.45, 7.30)
: రాజు వెడ్స్ రాంబాయి (4.30, 10.20)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : 12 ఏ రైల్వే కాలని (10.55, 4.40, 10.20)
: విక్డ్ ఫర్ గుడ్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.20)
స్క్రీన్-2 : 120 బహద్దూర్ (హింది) (11.00, 4.55, 10.50)
: ప్రేమంటే (2.00, 7.55)
స్క్రీన్-3 : సిస్సు రోడ్ టూ రివేంజ్ (12.20, 5.20)
: ఇట్లు మీ వెదవ (2.30)
: పాంచ్ మినార్ (7.30), : ది గర్ల్‌ఫ్రెండ్ (10.20)
స్క్రీన్-4 : మస్తీ-4 (హింది) (11.05, 7.40)
: రాజు వెడ్స్ రాంబాయి (2.10)
: కల్కి వనం (5.00), దేదే ప్యార్‌దే-2 (హింది) (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,26,500	రూ.1,16,625	రూ.1640

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290

